బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలు బాలల న్యాయ (జువెనైల్ జస్టిస్) చట్టం, 2015లోని సెక్షన్ 41 కింద తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా బాలల సంరక్షణాధికారి కె.వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ పొందడానికి ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ పొందలేదని తెలిపారు. ఈనెల 10వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు http://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ పొందని కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాహం కేకలు తప్పేనా..?

- 2,519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీరు
- మరమ్మతులకు గురైన పలు రక్షిత పథకాలు
- చేతిపంపులదీ అదే పరిస్థితి
- స్థానిక సంస్థలపైనే నిర్వహణా భారం



లావేరు మండలంలో మరమ్మతుకు గురైన బోరు

జిల్లాలో ఎండలు క్రమేణా పెరుగుతున్నాయి. పైగా ఈ ఏడాది ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ చెప్తోంది. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యలూ అధికంగా తలెత్తే అవకాశాలూ లేకపోలేదు. జిల్లాలో సగానికి పైగా గ్రామాల్లో పాక్షికంగానే తాగునీరు అందుతోంది. సమగ్ర, రక్షిత, సింగిల్ విలేజ్ స్కీమ్‌లు చాలాచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఏటా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేవారు. జల జీవన్ మిషన్ ద్వారా మంచినీటి కనెక్షన్లు ఇస్తున్నామనే పేరుతో ప్రభుత్వం మూడేళ్లుగా సరఫరా నిలిపేసింది. జల జీవన్ మిషన్ పనులకు అనుమతులు రావడంతో, పాత పథకాలకు ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం మానేసింది. దీంతో ఈ ఏడాది పల్లెవాసులకు నీటి కష్టాలు తప్పేలా లేవన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 3,127 గ్రామాలు ఉండగా కేవలం 1518 గ్రామాలకే తాగునీరు అందుతోంది. 2,519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీటి సరఫరా జరుగుతోంది. జిల్లాలో 38 సమగ్ర రక్షిత మంచి నీటి పథకాలు ఉండగా, చాలా పథకాలు సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లాలోని 918 రక్షిత మంచినీటి పథకాల పరిస్థితి అలానే ఉంది. జిల్లాలో 15,848 చేతిపంపులు ఉన్నా, ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతంలో రోజుకి 70 లీటర్ల నీటిని అందించాల్సి ఉండగా, 55 లీటర్ల నీటిని మాత్రమే అందించగలుగుతున్నారు. ఆ మేరకు తాగునీటిని అందిస్తున్న గ్రామాలు 1521 మాత్రమే ఉన్నాయి. పాక్షికంగా తాగునీరందుతున్న గ్రామాలు 2,497 ఉన్నాయి.

ప్రతి వారం ఏదో ఒక చోట రిపేరు

వేసవి కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ప్రతి వారం తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 3,127 ఆవాసాలు ఉండగా, ఇప్పటివరకు 747 గ్రామాలను తనిఖీ చేశారు. అందులో 4,054 చేతిపంపులను పరిశీలించి 179 మరమ్మతులకు గురవ్వగా వాటిని రిపేర్లు చేశారు. రక్షిత మంచినీటి పథకాలు, బహుళ గ్రామాల మంచినీటి పథకాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. గత వారంలో జి.సిగడాం, మెళియాపుట్టి, ఎల్.ఎన్ పేట, కొత్తూరు మండలంలో మరమ్మతులకు గురైన వాటిని రిపేరు చేశారు. సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్ల్యుఎస్) మరమ్మతులకు గురవ్వడంతో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత వారంలో 393 గ్రామాల్లోని ఆరు చోట్ల మరమ్మతులకు గురయ్యాయి. మందసలో రెండు చోట్ల, వజ్రపుకొత్తూరులో నాలుగు చోట్ల ఇబ్బందులు తలెత్తాయి.

నాలుగు చోట్ల జెఇ పోస్టులు ఖాళీ

వేసవి నేపథ్యంలో మంచినీటి పథకాలపై పూర్తిస్థాయిలో అధికారుల పర్యవేక్షణ చేయాల్సి ఉంది. మండలాల్లో జెఇలే వీటిని చూడాల్సి ఉంటుంది. జిల్లాలో నాలుగు చోట్ల జెఇలు లేరు. సోంపేట, హిరమండలం, ఎచ్చెర్ల, కొత్తూరు మండలాల్లో లేకపోవడంతో పొరుగు మండలాల జెఇలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బాధ్యతలను అప్పగించారు.

ఇదేం వేసవి కార్యాచరణ

వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికారులు రూపొందించిన కార్యాచరణ గతానికి భిన్నంగా ఉంది. ఏటా జిల్లాలో నీటిఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో తాగునీటి పథకాలకు రిపేరు చేయడం, బావుల్లో పూడిక తొలగించడం, చేతిపంపులు పనిచేసేలా చూడడం కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం రూ.రెండు కోట్ల నుంచి రూ.మూడు కోట్ల వరకు నిధులు కేటాయించేది. జల జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయనే పేరుతో ప్రభుత్వం నిధులు కేటాయింపులు ఆపేసింది. గ్రామాల్లో మంచినీటి పథకాల నిర్వహణ, రిపేర్లకు పంచాయతీలు, జిల్లాపరిషత్ నిధులు కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ నీటి సరఫరా అధికారులు కేవలం గ్రామాలను సందర్శించి పథకాల్లో లోపాలపై సాంకేతిక సలహాలు ఇవ్వడానికే ప్రభుత్వం పరిమితం చేసింది. వాటి రిపేర్లకయ్యే ఖర్చును స్థానిక సంస్థలకు అప్పగించింది.

పంచాయతీ పాలకవర్గాలు నిధులు ఇచ్చేనా?

సిపిడబ్ల్యుఎస్ పథకాల కోసం జెడ్‌పి, రక్షిత మంచినీటి పథకాల కోసం గ్రామ పంచాయతీలు తమ ఖాతాల నుంచి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. చేతిపంపుల రిపేర్లకు మండలాల నుంచి గ్రాంట్ ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాపరిషత్ నుంచి కొంతమేర నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నా పంచాయతీలు, మండలాల పాలకవర్గాలు ఏ మేరకు నిధులు కేటాయిస్తాయో చూడాల్సి ఉంది. మంచినీటి పథకాలకు డబ్బులు ఇచ్చేందుకు సర్పంచ్‌లు నిరాకరించిన పరిస్థితిని గతంలో చూశాం. పంచాయతీ అధికారులు మోనటరింగ్ చేస్తే గానీ మంచినీటి పథకాలకు డబ్బులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా జరిగేనా?

తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండే ప్రాంతాలు, భూగర్భ జలాలు అడుగంటిన గ్రామాల్లో గతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పరిస్థితి ఉండేది. వేసవి కార్యాచరణలో భాగంగా ముందుగానే అటువంటి గ్రామాలను గుర్తించి తాగునీటిని సరఫరా చేసేవారు. ఈసారి అందుకు భిన్నంగా అప్పటికప్పుడు ఎక్కడైనా అవసరం పడితే సరఫరా చేయాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. ఇందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిసింది. అందులో వివరాలు నమోదు చేసి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు.

నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలో వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాం. గ్రామాల్లోని పథకాలు, చేతిపంపులను ప్రతి వారం తనిఖీ చేసి లోపాలను గుర్తిస్తున్నాం. వాటికి జెడ్‌పి, మండల పరిషత్, పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుంది. బావుల్లో పూడికతీత, రవాణా వంటి అంశాల కోసం అయ్యే ఖర్చుపై ప్రభుత్వ సూచన మేరకు అంచనాలను పంపుతున్నాం. ప్రభుత్వం ఆమోదం తెలిపితే పనులు చేపడతాం.

- ఎహసన్ భాషా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ



ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

మద్దతు ధరల గ్యారంటీకి చట్టం చేయాలి

- వ్యవసాయాన్ని, సహకార రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర
- మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం
- సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్
- కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా ప్రాతిపదికన రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర స్థిరీకరణకు వీలుగా మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని రైతుసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రమణ, పి.ప్రసాదరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతులకు రుణమాఫీ చేసి, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని తదితర డిమాండ్లతో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల గుప్పిట్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రి మిషన్, నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్స్ పేరుతో కొత్త విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. వీటివల్ల దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లు, సహకార రంగాన్ని నిర్వీర్యం చేసి బహుళ సహకార వ్యవస్థ అమలుకు సిద్ధమవుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా ప్రాతిపదికన రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర స్థిరీకరణకు వీలుగా మద్దతు ధరల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేసి, సమగ్ర పంటల బీమా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులు పండిస్తున్న జీడి, మిర్చి, ధాన్యం, కందులు, జొన్నలు, పత్తి, శనగ, పొగాకు వంటి పంటలకు మద్దతు ధరలు ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి తోడ్పాటు అందించడంలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలన్నారు. జిల్లాలో నారాయణపురం కాలువలను ఆధునీకరించి చివరి భూములకూ నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంశధార, బాహుదా నదులు అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందించాలన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గిరిజనుల కోసం ఐటిడిఎను ఏర్పాటు చేయాలని, గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, 1/70 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో రైతుసంఘాల నాయకులు కె.కొండయ్య, పి.సాంబమూర్తి, అల్లు సూర్యనారాయణ, ఎస్.కృష్ణవేణి, రాజేశ్వరరావు, రామారావు, కన్నపుడు ఎస్.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నేడు 18 మద్యం దుకాణాలకు లాటరీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 2024-26 ఆర్థిక సంవత్సరానికి గానూ నూతన మద్యం పాలసీలో గీత కులాలకు, సొండి కులానికి కేటాయించిన 18 మద్యం దుకాణాలకు నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఈనెల ఆరో తేదీన లాటరీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సిహెచ్.తిరుపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గీత కులాల వారికి కేటాయించిన 16 మద్యం దుకాణాలకు 166 దరఖాస్తులు, సొండి కులాల వారికి కేటాయించిన రెండు దుకాణాలకు 37 దరఖాస్తులు ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ పద్ధతిలో వచ్చాయని తెలిపారు. గత నెల 8న దరఖాస్తులు స్వీకరించి పదో తేదీన లాటరీ పద్ధతిలో ఎంపికలను నిర్వహించినా, ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్టు అమలు కారణంగా తాత్కాలికంగా వాయిదా వేసినట్టు వివరించారు.

కోడ్ అమలు ముగిసిన కారణంగా గురువారం ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతిలో తిరిగి ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. దరఖాస్తుదారులు కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎంట్రీ పాస్, ఆధార్ కార్డు తీసుకుని గంట ముందు అంబేద్కర్ ఆడిటోరియం వద్దకు చేరుకోవాలని సూచించారు.

సిఎంపై విమర్శలు సిగ్గుచేటు

విజయనగరం ఎంపీ అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

ప్రజాశక్తి - రణస్థలం

ఐదేళ్లు రాష్ట్రాన్ని నాశనం చేసిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి... కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రణస్థలంలో తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక విధ్వంసం జరిగిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు నాయుడు చాలా కష్టపడుతున్నారని చెప్పారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి నిధుల కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. రాష్ట్రం కోసం ఇంత చేస్తున్న చంద్రబాబుపై జగన్ విమర్శలు రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నాయన్నారు. లేనిపోని విమర్శలు చేయడం మాని ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇస్తే మంచిదని హితవు పలికారు. సమావేశంలో టిడిపి నాయకులు డి.జి.ఎం ఆనందరావు, పిషిణి జగన్నాథం, పైడి అప్పడుదొర, లంక శ్యామలరావు, కలిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ కార్యాలయ సిబ్బంది, నిర్వాహకులతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

అదనపు బిల్లులు వసూలు చేస్తే ఏజెన్సీ రద్దు

- గ్యాస్ ఏజెన్సీ నిర్వాకంపై జరిమానాకు ఆదేశం
- డెలివరీ సిబ్బందికి జీతాలు ఇవ్వరా..?
- ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించిన జెసి

ప్రజాశక్తి - పొందూరు

గ్యాస్ వినియోగదారుల నుంచి గ్యాస్ కంపెనీ బిల్లు కంటే ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా బాధ్యత ఏజెన్సీ నిర్వాహకులదేనని, అదనపు వసూలు చేస్తే గ్యాస్ ఏజెన్సీ అనుమతులు రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు. పొందూరులోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, గొడౌన్లను జెసి బుధవారం తనిఖీ చేశారు. బిల్లు కంటే అదనంగా వసూలు చేస్తున్నారంటూ పొందూరు పట్టణానికి చెందిన మహిళలు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించగా డిఎస్ఒ జి.సూర్యప్రకాష్, తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు విచారణ చేసి అధికారులకు నివేదిక అందించారు. నివేదిక ఆధారంగా ఏజెన్సీ నిర్వహణ బాధ్యతను రణస్థలం ఏజెన్సీకి అప్పగించారు. దీనిపై ఐఒసి అధికారులు సైతం విచారణ చేశారు. గొడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జెసి, తహశీల్దార్ గొడౌన్‌ను సీజ్ చేసిన సమయంలో స్టాక్ వివరాలకు, ప్రస్తుతం గొడౌన్‌లో ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం గ్యాస్ కార్యాలయంలో డెలివరీ సిబ్బంది, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. గ్యాస్ డెలివరీ సిబ్బందికి, సరైన జీతాలు ఎందుకు ఇవ్వడం లేదంటూ ప్రశ్నించారు. గ్యాస్ డెలివరీ సిబ్బంది అదనంగా రూపాయి వసూలు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మరోసారి వినియోగదారుల నుంచి ఫిర్యాదు వస్తే వెంటనే ఏజెన్సీ రద్దు చేయాలని డిఎస్ఒను ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీ బాధ్యతలను తాత్కాలికంగా రణస్థలం ఏజెన్సీకి అప్పగిస్తే, గ్యాస్ డోర్ డెలివరీ ఎందుకు చేయలేదని డెలివరీ సిబ్బందిని మందలించారు. అదనపు వసూళ్లకు పాల్పడిన గ్యాస్ ఏజెన్సీకి నిబంధనల ప్రకారం జరిమానా విధించి నివేదిక ఇవ్వాలని డిఎస్ఒను ఆదేశించారు.

సిఐఎస్ఎఫ్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు (సిఐఎస్ఎఫ్)లో ఉద్యోగ నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుల్, ట్రేడ్‌మెన్ ఉద్యోగాల్లో నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 1161 ఖాళీలకు గానూ కుక్, టైలర్, వాషర్‌మెన్, స్వీపర్, కార్పెంటర్ తదితర ఖాళీలను భర్తీ చేసేందుకు పురుషులు, స్త్రీలు మాజీ సైనికుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి/మెట్రిక్, ఐటిఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2025 ఆగస్టు ఒకటో తేదీ నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://cisfrectt.cisf.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి నోటిఫికేషన్‌ను పరిశీలించాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 3 చివరి తేదీ అని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లీన్ క్యాంపస్... గ్రీన్ క్యాంపస్

ఎచ్చెర్ల: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం ప్రాంగణంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన మెగా స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, ఎఒ ముని రామకృష్ణ పర్యవేక్షణలో క్యాంపస్‌లోని నాగావళి, వంశధార, చంపావతి, వేగావతి, సువర్ణముఖి, మహేంద్రతనయ, అక్షయ తదితర తరగతి గదుల భవన సముదాయాలు, వసతిగృహాల చుట్టూ వాలంటీర్లు ప్లాస్టిక్, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బాలాజీ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి సామాజిక బాధ్యతతో భవిష్యత్ తరాలను స్వచ్ఛత వైపు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు వి.సింహాచలం, జి.ఈశ్వరరావు, డి.సింధూజ, ఆర్.పద్మావతి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


నిలిచిన 'ఉపాధి' బిల్లులు

- దీర్ఘకాల సెలవులో ఎంపిడిఒ
- ఇన్‌ఛార్జిగా ఎవరినీ నియమించని ఉన్నతాధికారులు
- ఉపాధి వేతనాలు, మెటీరియల్ కాంపోనెంట్ బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియకు బ్రేక్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండలంలో ఉపాధి హామీ కూలీల కూలి డబ్బులు, మెటీరియల్ కాంపోనెంట్ బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియ నిలిచిపోయింది. ఉపాధి హామీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగ అభివృద్ధి పనుల బిల్లుల అప్‌లోడ్‌లో ఎంపిడిఒ పాత్ర కీలకం. ఎంపిడిఒ ఎస్.హరిహరరావు దీర్ఘకాల సెలవుపై వెళ్లడంతో ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఉన్నతాధికారులు ఎవరినీ నియమించలేదు. దీంతో బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియ నిలిచిపోవడంతో ఉపాధి కూలీలు, కాంట్రాక్టర్లు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో ప్రతి పంచాయతీలోనూ పెద్దఎత్తున ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదే సమయంలో పల్లె పండగ మెటీరియల్ కాంపోనెంట్ పనులూ చేపడుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పలు అభివృద్ధి పనులతో పాటు ఇతర శాఖల అభివృద్ధి పనులను ఎంపిడిఒ పర్యవేక్షించడంతో పాటు బిల్లులు పాస్ చేయడం, డిజిటల్ సిగ్నేచర్ వంటివి చేయాల్సి ఉంటుంది. ప్రత్యేకించి ఉపాధి హామీ కూలీల వేతనాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేందుకు ఎంపిడిఒ అనుమతి తప్పనిసరి. పల్లె పండుగ పనులు బిల్లులు అప్‌లోడ్ చేయడంలోనూ ఎంపిడిఒ పాత్ర కీలకం. ఈ పరిస్థితుల్లో మండలంలో ఎంపిడిఒ సెలవుపై వెళ్లగా, ఇన్‌ఛార్జి ఎంపిడిఒను నియమించాల్సిన ఉన్నతాధికారులు మిన్నకున్నారు. దీంతో ఉపాధి కూలీల వేతనాలు సకాలంలో అప్‌లోడ్ కాకపోవడంతో పాటు ఆర్థిక సంవత్సరం ఆఖరు కావడంతో బిల్లులు మరుగున పడిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ఎంపిడిఒను నియమించాలని కోరుతున్నారు.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న సుబ్రమణ్యేశ్వరి

శ్రీకాకుళం అర్బన్: మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, సీజనల్, ఇతర అంటు వ్యాధులు విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని మలేరియా రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి.వి.బాలమురళీ కృష్ణ వైద్యాధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, అతిసారం, వడదెబ్బ తదితర వ్యాధుల వ్యాప్తి అరికట్టడానికి తీసుకోవాలన్నారు. జిల్లాలో వ్యాధులు విజృంభించకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపైనే ఉందన్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎంతమంది వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని, వారంతా అప్రమత్తంగా ఉంటే, చాలావరకు వ్యాధులను అరికట్టవచ్చునని స్పష్టం చేశారు. యాప్‌ల్లో అప్‌లోడ్ చేసేటప్పుడు, ప్రభుత్వానికి నివేదికలను పంపించేటప్పుడు ఒకటిరెండు సార్లు సరిచూసుకోవాలన్నారు. కచ్చితమైన వివరాలను పంపించాలని సూచించారు. వచ్చే వేసవిలో వడదెబ్బకు గురికాకుండా అవగాహనా కార్యక్రమాలు, ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలన్నారు. జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారి టి.వి.సత్యనారాయణ, స్టేట్ కన్సల్టెంట్ శ్రీకాంత్, డిపిఎంఒ వాన సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాల అనుమతులు సరళం

సుడా చైర్మన్ కె.రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలో నిర్మిస్తున్న భవనాలకు అనుమతులు సులభతరం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. నగరంలోని సుడా కార్యాలయంలో వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సుడా పరిధిలోని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వచ్చిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులను సులభంగా పొందేందుకు అవసరమైన మార్పులను తీసుకొస్తామన్నారు. నగర, జిల్లాస్థాయిలో సమన్వయంతో అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని, అందులో భాగంగా నిర్మాణ అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో టౌన్‌ప్లానింగ్ పిఒ, ఎపిఒ, జెపిఒ, సుడా అధికారులు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పిహెచ్‌సి సందర్శన

నందిగాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్‌ను, మందులచీటీ గది, వ్యాక్సినేషన్ రూమ్‌లను పరిశీలించారు. నౌగాంలోని వార్డులో పాటు సిబ్బంది పనికి కాంపౌండ్ వాల్ నిర్మించాలని పిఒ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశీలించారు. ఈయనతోపాటు వైద్యాధికారులు అనితకుమారి, కె.సుభాష్, సిహెచ్‌ఒ దాతారాం, సిహెచ్‌ఒ సూర్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.


ఉమెన్స్‌కి జ్ఞాపికను అందజేస్తున్న డిఎస్‌పి

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

రణస్థలం రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటూ అన్ని రంగాల్లో ముందుండాలని శ్రీకాకుళం డిఎస్‌పి వివేకానంద అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వెంకటేశ్వర కల్యాణ మండపంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలో సిఐ ఎం.అవతారం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాలు నుంచి రక్షణ పొందాలని, అది అవగాహనతోనే సాధ్యం అవుతుందన్నారు. మూడు నెలలకు ఒకసారి ఉత్తమ మహిళా పోలీస్ ఎంపిక, ఎస్‌పి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేయటం జరుగు తుందన్నారు. శాఖాపరంగా మహిళా ఆరోగ్యంపై, సైబర్ నేరాలపై, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం కోస్ట్ సివిలాయం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బమ్మిడి అమ్మిత్ కవిత్యాలు గుర్తించి ఆమెకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎస్.చిరంజీవి, వెలిచేటి సందీప్ కుమార్, వై.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన అవసరం

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన అవసరమని ప్రముఖ వైద్యులు డాక్టర్ వినోద్ కుమార్ కూర్మాన అన్నారు. బుధవారం నగరంలోని గీతాంజలి పాఠశాలలో జూనియర్ చాంబర్స్ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షులు సింగూరు ప్రవీణ్ ఆధ్వర్యాన విద్యార్థులకు సిపిఆర్‌తో పాటు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో స్పందించాలన్నారు. ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆగిన గుండెకు మళ్లీ జీవం పోసే ప్రక్రియను తెలియజేస్తూ, సిపిఆర్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో జెసిఐ చార్టర్ ప్రెసిడెంట్ దూసి సంతోష్, సెక్రెటరీ సుదర్శన్, ట్రెజరర్ వెంకటేష్ జగదీష్, లోహిత్ పాల్గొన్నారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షకు 307 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 307 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ద్వితీయ ఇంటర్ పరీక్షకు 18709 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18,402 మంది మాత్రమే హాజరయ్యారు. 307 మంది పరీక్షకు హాజరుకాలేదు. జనరల్ కేటగిరిలో 17623 మంది హాజరు కావాల్సి ఉండగా 17,345 మంది మాత్రమే హాజరయ్యారు. 278 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఒకేషనల్ పరీక్షకు 1086 మందికిగాను 1057 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఒ ప్రగడ దుర్గారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేదని ఆయన వివరించారు.


డాక్టర్ సంధ్యశ్రీ పండాను సన్మానిస్తున్న ప్రతినిధులు

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

శ్రీకాకుళం అర్బన్: మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, పరివారం ఆరోగ్యంగా ఉంటుందని, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సంధ్య శ్రీ పండా అన్నారు. నగరంలోని ఇల్లిసిపురంలో బ్రహ్మకుమారిస్ సేవా కేంద్రంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన వైద్యులు హాజరై మహిళల ఆరోగ్య సమస్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నంకు చెందిన డాక్టర్ మణి భూషణ్, మానవతా స్వచ్ఛత సంస్థ చైర్మన్ విష్ణుమూర్తి, వైస్ ప్రెసిడెంట్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్స్ తనిఖీ

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో లేబర్ ఆఫీసర్ విజయ కుమార్, ఎంఇఒ సత్యంలు వివిధ షాపింగ్ మాల్స్, జీడీ పరిశ్రమల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న బాలకార్మికులను చేర్చుకోడం చట్టరీత్యా నేరమని, అట్టివారిని చేర్చుకోరాదని యాజమాన్యాలకు హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా కార్మికులను తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులను తీసుకొనే సమయంలో వివరాలను పూర్తి స్థాయిలో తీసుకోవాలన్నారు. ఎక్కడ ఉంటున్నారు? తల్లిదండ్రుల వివరాలు, ఆధార్‌కార్డు వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.

'మాతృమూర్తి' సేవలు భేష్

కవిటి: ఉద్దానం ప్రాంతంలో 15 ఏళ్లుగా మాతృమూర్తి యువజన సంఘం అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎఎంసి మాజీ వైస్ చైర్మన్, బల్లిపుట్టుగ సర్పంచ్ ప్రతినిధి రజనీకుమార్ దళాయి అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగకు చెందిన సావిత్రి దళాయి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. రెక్కాడితే గాని డొక్కాడని ఆమె వైద్యం కోసం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు బుధవారం ఆమె నివాసానికి చేరుకుని అండగా నిలిచారు. తక్షణ సాయంగా రూ.8 వేలు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ అనారోగ్యంతో పాటు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న సావిత్రి దళాయిని స్వచ్ఛంద సంస్థలు, ఆపన్న హస్తాలు ఆదుకోవాలని కోరారు.


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

మధ్యాహ్న భోజన బియ్యం మార్పుకు చర్యలు


అన్నాన్ని పరిశీలిస్తున్న ఇంటెలిజెన్స్ సిబ్బంది, హెచ్‌ఎం

- సమగ్ర శిక్ష సంచాలకుల దృష్టికి సమస్య
- ఎంఇఒ, హెచ్‌ఎంలకు నివేదిక ఇవ్వాలని డిఇఒ ఆదేశం
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన ఎస్‌పిడి

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రంలోని జెడ్‌పి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నాసిరకం బియ్యం సరఫరా చేయడంతో అన్నం ముద్దయిపోవడంతో విద్యార్థులు తినడానికి పనికి రాకపోవడంతో 'విద్యార్థుల పస్తులు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం ప్రచురితం కావడంతో దీనిపై రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకులు ఎస్‌పిడి బి.శ్రీనువాసరావు దృష్టికి వెళ్ళడంతో దానిపై ఆయన స్పందించారు. దానిపై నివేదిక ఇవ్వాలని డిఇఒను ఆదేశించడంతో బుధవారం డిఇఒ తిరుమల చైతన్య ఎంఇఒ, హెచ్‌ఎంలను రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించడంతో బుధవారం ఎంఇఒ మురళీకృష్ణ పాఠశాలకు చేరుకొని హెచ్‌ఎం జగన్నాథరావుతో కలిసి మంగళవారం జరిగిన ఘటనపై సమగ్రమైన నివేదికను తయారు చేసి డిఇఒ కార్యాలయానికి అందజేశారు. అలాగే ఇంటెలిజెన్స్, విజిలెన్స్, పౌరసరఫరాల సిబ్బంది బుధవారం పాఠశాలకు వచ్చి ముద్దయిన అన్నం విద్యార్థులు తినకుండా బయట తుప్పల్లో పడేసిన అన్నాన్ని పరిశీలించారు. అనంతరం మరలా బుధవారం మధ్యాహ్న భోజనం వంటలో కొన్ని జాగ్రత్తలు తీసుకొని కొన్ని చిట్కాలు ప్రయోగించి బియ్యాన్ని వండడంతో అన్నం బాగుందని పిల్లలు బాగానే తిన్నారని ఎంఇఒ, హెచ్‌ఎంలు తెలిపారు. నాసిరకం బియ్యాన్ని మార్చి మంచి బియ్యన్ని పాఠశాలకు అందించాలని ఇప్పటికే ఎంఎల్‌ఎస్ ఇన్‌ఛార్జిని ఆదేశించామని, మంచి బియ్యాన్ని మధ్యాహ్న భోజనానికి సరఫరా చేస్తున్నట్లు తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. ఎంఇఒ వండిన అన్నాన్ని దగ్గరుండి పరిశీలించారు. వారితో పాటు ఎస్‌ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు, ఉపాధ్యాయులు, ఎండిఎం వంట కార్మికులు ఉన్నారు.


అన్నాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ, హెచ్‌ఎం, ఎస్‌ఎంసి చైర్మన్ తదితరులు

117 జిఒ రద్దు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

రాష్ట్రంలో జిఒ నంబర్ 117ను రద్దు చేయాలని, దాదాపు అన్ని ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయని ఎపియుఎస్ జిల్లా కార్యదర్శి జి.వెంకట గిరి ఆరోపించారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ ప్రతినిధులు గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిఒ నంబర్ 117ను రద్దు చేస్తామని, 3, 4, 5 తరగతుల విలీనాన్ని వెనక్కి తీసుకుంటామని, పాఠశాల విద్యను గాడిలో పెడతామని, ఉపాధ్యాయుల పని ఒత్తిడిని తగ్గిస్తామని హామీ ఇచ్చారని, అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక జిఒ నంబర్ 117 రద్దు చేయకపోగా అదే జిఒతో టీచర్ల పని సర్దుబాటు చేయడానికి పూనుకోవడం సమంజసం కాదన్నారు. వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, టీచర్ల పని సర్దుబాటు ద్వారా 3,4,5 తరగతుల బోధనకు ఎస్‌జిటిలను పంపి అక్కడ ఉన్న స్కూల్ అసిస్టెంట్లను మరో హైస్కూల్‌కు పంపాలని, తద్వారా సబ్జెక్ట్ టీచర్ల కొరత తీర్చాలన్నారు. అలాగే పదిలోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూసి వేయాలని ప్రభుత్వం యోచన చేస్తున్నట్లు తెలుస్తోందని దీనివల్ల ఎంతోమంది టీచర్లు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, ఇది ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారుతుందని కాబట్టి సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని, పదోన్నతులు చేపట్టి ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయుల లోటును భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎపియుఎస్ మండల అధ్యక్షులు జి.చిన్నికృష్ణం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు, ఎం.రవిభట్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపియుఎస్ జిల్లా కార్యదర్శి వెంకటగిరి

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- పొందూరు

ఎపిఇపిడిసిఎల్ శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని పొందూరు మండలం రాపాక కూడలి వద్ద గల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈనెల 7న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డివిజన్ పరిధిలోని పొందూరు, జి.సిగడాం, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం, పైడిభీమవరం పరిధిలో గల వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించు కోవాలన్నారు. ఈ సమావేశానికి సిజిఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డా.బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సులేఖరాణి, అకౌంటెంట్ సభ్యులు షేక్ బాబర్ హాజరవుతారని పేర్కొన్నారు.


పెళ్లి కానుకను అందజేస్తున్న జగదీష్ పట్నాయక్

పెళ్లి కానుక అందజేత

కంచిలి : కంచమ్మ తల్లి ఆలయ దత్తత గ్రామాల్లో పెళ్లి చేసుకోనున్న నూతన వధువులకు కంచిలికి చెందిన జగదీష్ పట్నాయక్ బుధవారం పెళ్లికానుక అందజేశారు. తన తల్లి జ్ఞాపకార్థం ఏటా అందించే ఈ పెళ్లికానుకను ఆరుగురు నూతన వధువులకు అందించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికీ రూ.పది వేలు నగదు, పసుపు, కుంకుమ, చీర అందించారు. కార్యక్రమంలో ఎం.ఎం. పట్నాయక్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న ఎడిఎ జగన్మోహరావు

అగ్గితెగులుతో జాగ్రత్త

కవిటి: రబీ పంటలకు అగ్గితెగులు ఆశిస్తోందని, రైతులు అప్రమత్తంగా వ్యవహరించి యాజమాన్య పద్ధతులు పాటించాలని సోంపేట ఎడిఎ జగన్మోహనరావు సూచించారు. మండలంలోని బట్టివానిపాలెం, బొరివంక గ్రామాల్లోని రాగి, వరి పంటలను బుధవారం పరిశీలించారు. ఈ క్రమంలో రాగి పంటకు అగ్గి తెగులు, కాండం తొలిచేపురుగు ఆశించినట్టు గుర్తించారు. వాటి నివారణకు కార్బ్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ లీటరు నీటికి రెండు గ్రాములు, ట్రై సైక్లోజోల్ లీటర్ నీటికి 0.7 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ప్రస్తుతం 25 కిలోల యూరియాతో పాటు 15 నుంచి 20 కిలోలు పొటాష్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ బడగల దుర్గాప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి బెందాళం శ్రీకళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

కంచిలి : మండలంలోని బూరగాంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఎంపిడిఒ వి.తిరుమలరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.ప్రేమ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

నాణ్యత లేబొరేటరీని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో నిర్మాణంలో ఉన్న జాతీయ ఉపాధిహామీ పథకం సిమెంట్ రోడ్డు నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం జెడ్‌పి ఆవరణలో ఉన్న పంచాయతీ శాఖ క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈనెల 1న పొందూరు మండల కేంద్రంలో సిమెంట్ రోడ్లు నుంచి సేకరించిన కోర్‌ల పరీక్షలను ఆయన స్వయంగా పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన సుమారు రూ.600కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్ల నాణ్యతపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో మార్చి 31లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. నాణ్యత విషయంలో ఇంజినీర్లు రాజీ పడొద్దని సూచించారు. జిల్లాలో ఈ కార్యక్రమం వల్ల పెద్దఎత్తున రోడ్ల నిర్మాణానికి తోడ్పాటు లభించిందని, అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అయితే నిర్మిస్తున్న రోడ్లపై భవిష్యత్‌లో నాణ్యతా లోపాలు లేకుండా ముందు జాగ్రత్తగా కోర్‌లను నాణ్యత ప్రమాణాల పరీక్షలకు పంపించాలని ఆయన సూచించారు. లేబరేటరీలో పరీక్షల సమయంలో నాణ్యతా లోపాలు గుర్తించడానికి వీలువుతుందన్నారు. పొరపాట్లకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన ఆదేశించారు. ఆయనతో పాటు పంచాయతీరాజ్ ఇఇ ఎస్.రామకృష్ణ, క్వాలిటీ కంట్రోల్ ఎఇలు శ్రీధర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పవర్‌ప్లాంట్‌ను అడ్డుకుంటే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న అప్పారావు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న పవర్ ప్లాంట్‌ను అడ్డుకుంటే టిడిపి దళిత సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని రాష్ట్ర ఎస్‌సి మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీసభ్యులు తోట రాము హెచ్చరించారు. బుధవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో నియోజకవర్గ టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు గుర్రాల చిన్నబాబు ఆధ్వర్యంలో దళిత సంఘ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోనెల అప్పారావు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఐదేళ్ల బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్‌లు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి, ఆమదాలవలస టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఇల్లాకుల ప్రభాకర్, పొన్నాడ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి గోకార్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్-2 పోటీలను బుధవారం హైదరాబాద్‌కు చెందిన డీప్ లూప్, టెక్నాలజీ సిఇఒ సూర్య ప్రకాష్ కుసుమంచి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం పోటీలకు పరిమితం కాకుండా ఆటోమొబైల్ ఆవిష్కరణలను ఉత్పత్తి వైపు తీసుకెళ్లి పరిశ్రమ స్థాపనకు కృషి చేశారన్నారు. వాణిజ్య, వ్యాపార వర్తకులుగా ఎదిగి వ్యక్తిగత, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఐతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ జాతీయ స్థాయి గోకార్టింగ్ పోటీలను యాజమాన్యం రెండో సారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల ప్రతిభను సమాజం దృష్టికి తీసుకువెళ్లడమే ప్రధాన ధ్యేయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ 16 బృందాలు పాల్గొని వారి ప్రతిభను పరీక్షించుకోనున్నారన్నారు. కార్యక్రమంలో కో-కన్వీనర్లు డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, ఇసిఇ హెచ్‌ఒడి డాక్టర్ వి.అశోక్‌కుమార్, సిఎస్ఇ హెచ్‌ఒడి డాక్టర్ వై.రమేష్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘువీర్ దొంటి కురిటి, విద్యార్థి కన్వీనర్లు పి.ఉదయకుమార్, బి.సాయి సాకేత్లు పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న లూప్, సూర్యప్రకాష్


టీకాలు వేయిస్తున్న కరుణాకరరావు

టీకాలతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టీకాలతో పశు వ్యాధులు దూరమవుతాయని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని భరణికోట పంచాయతీ మరలో టీకాల కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెళియాపుట్టి మండలంలో 15,200 పశువులకు టీకాలు వేయడానికి లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మండలంలో మూడు టీములు ప్రతి గ్రామానికీ వచ్చి ఈ టీకాలు వేస్తున్నామని అన్నారు. నాలుగు మాసాలు దాటిన ఆడదూడలకు బ్రూసిల్లా వ్యాక్సిన్ చేయనున్నట్లు చెప్పారు. నాలుగు మాసాల దూడలకు గాలికుంటు టీక వేసిన నెల తర్వాత బూస్టర్ డోస్ మళ్లీ వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ స్టాక్ ఆఫీసర్ రాసా, పశువైద్య సిబ్బంది రాధ, ఢిల్లీ, చిన్నారావు పాల్గొన్నారు.



సిక్కోలు కళా ప్రపూర్ణ చిట్టిబాబు మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

లలిత సంగీతమే జీవిత గమ్యంగా భావించిన తపస్వి, అసమాన హార్మోనియం వాయిద్య కళాకారులు అవిశ్రాంత సాధకులు సంగీత పిపాసులు, నిరాడంబరులు, సిక్కోలు లలిత సంగీత మెరువు సిక్కోలు బండారు చిట్టిబాబు (89) బుధవారం స్వగృహంలో మృతి చెందారు. బండారు చిట్టిబాబు 1936లో జన్మించారు. సత్యనారాయణ, వరాహలమ్మలకు ఐదవ సంతానంగా జన్మించారు. సుమారు తొమ్మిది దశాబ్దాలుగా సంగీత పయనంలో అసమాన ప్రతిభతో 400 పైగా లలిత గీతాలను స్వరకల్పన చేస్తూ కళామతల్లికి ఎనలేని సేవ చేశారు. అప్పట్లో ఆయన గురువులు పేరయ్య శాస్త్రి, బొంపాడ రామచంద్రరావు, రామన్న వద్ద శిష్యరికం చేసి ఎన్నో అవంతరాలు వచ్చినా సంగీత సాధనం చేయడం మానలేదు. ఈ దశలోనే 1955లో సినీ నటుడు రావి కొండలరావు, తిమ్మరాజు శివరావుల సహకారంతో సుకుమార ఆర్కెస్ట్రా నెలకొల్పారు. తిరుపతిలో స్వర్ణోత్సవాలు కూడా నిర్వహించారు. ఆ స్వర్ణోత్సవాల్లో కళామతల్లికి నమో నమో" అంటూ స్వరపరచిన తొలి పాటగా నమోదయింది. సినీ రచయితలు దేవులపల్లి, ఆరుద్ర, సినారె, జొన్నవిత్తుల, శ్రీకాకుళం దూసి ధర్మారావు రచించిన లలిత గీతాలను స్వరకల్పన చేస్తూ హార్మోనియంపై వాయిద్య సహకారం అందించారు. 'అంటరాని వారు ఎవరంటే' 'ఏది హిందూ ఏది ముస్లిం' పాటలు జాతీయ భాషల్లో కూడా స్వరపరిచారు. ఆయనే సంగీతం, దర్శకత్వం వహించిన రాధ కథ, విశ్వరథం, సుధా బిందువులు నిర్వహించారు. గాయకులు బాలమురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, ఎస్‌పి బాలసుబ్రమణ్యం, జానకి, రామకృష్ణ, జి.ఆనంద్ తదితరులు సంగీత సారథ్యంలో పనిచేశారు. గానగంధర్వులు ఘంటసాల భగవద్గీత స్వరకల్పనకి బండారు చిట్టిబాబు సహకారం తీసుకోవడం జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు చేతులమీదుగా గొప్ప సన్మాన సత్కారం పొందారు. 1974లో అప్పటి రాష్ట్రపతి సంజీవరెడ్డి చేతులమీదుగా బంగారు పతకం పొందారు. 1983లో బాల మురళీకృష్ణ చేతులమీదుగా కళా ప్రవీణ బిరుదు పొందారు. 1984లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సభ్యునిగా చిట్టిబాబును నియమించారు.

ఈయన కుమారుడు బండారు రమణమూర్తి కూడా తబలా వాయిద్య కళాకారుడుగా రాణిస్తున్నారు. ఈయన మృతిపై ఆయన సహచరులు, గాయకులు నిక్కు అప్పన్న, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, తరణి కృష్ణ, సంస్థ అధ్యక్షులు మండా శ్రీనివాసరావు, ఉపనిషన్ మందిరం గౌరవ అధ్యక్షులు గుమ్మ నగేష్, శ్రీ సుమిత్రా కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర్ శర్మ, రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎల్.రామలింగస్వామి, చిట్టి వెంకటరావు, పన్నాల నరసింహమూర్తి, గాయకులు కెవిఎన్ మూర్తి, కళ్యాణ రామ్మోహన్ తదితరులు మరణ వార్త విన్న వెంటనే చిట్టిబాబు స్వగృహానికి చేరుకొని నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చారు.

కొర్లాం మాజీ ఎంపిటిసి మృతి


భారతమ్మ (ఫైల్)

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం ఎంపిటిసి మాజీ సభ్యులు తామాడ భారతమ్మ (60) బుధవారం ఆకస్మిక మృతి చెందారు. భిలాయిలోని తన బంధువుల ఇంటి వద్ద ఉండేవారు. అక్కడ బిపి, సుగర్ వ్యాధితో పరిస్థితి విషమించి మృతి చెందారు. గురువారం ఉదయం 11 గంటలకు స్వగ్రామం లక్ష్మీపురంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతిపై జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎంపిపి నిమ్మన దాసు, కొర్లం సర్పంచ్ రాంబుడ్డి గణపతి, స్థానిక ప్రజా ప్రతినిధులు తమ సంతాపం తెలియచేశారు.

పుస్తెలతాడు చోరీ

కొత్తూరు : మండలంలోని మదనపురానికి చెందిన ఆగతముడి కళావతి మెడలో పుస్తెలతాడు మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురైనట్లు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారని అన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తెలుగు మహాసభలకు ఆహ్వానం


కుమార్ నాయక్


కృష్ణమూర్తి

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 8,9 తేదీల్లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నిర్వహించనున్న తెలుగు మహాసభలకు తెలుగు జానపదరంగ ప్రతినిధి డాక్టర్ కుమార్ నాయక్, తెప్పల కృష్ణమూర్తిలకు బుధవారం ఆహ్వానం అందించింది. 'మన తెలుగు జానపదాలు' అనే అంశంపై పలువురు వక్తలు వేదికలో మాట్లాడుతారు. ఆ వేదికలో పాల్గొనే అరుదైన అవకాశం కాశీబుగ్గకు చెందిన కుమార్ నాయక్‌కు లభించింది. దీంతో ఉద్దానం రచయితల వేదిక అధ్యక్షులు కుత్తుం వినోద్, గిడుగు రామ్మూర్తి, కళావేదిక కన్వీనర్ శిష్టుమనోజ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.మాధవరావు, పింఛనుదారుల ప్రధాన కార్యదర్శి ఎన్.అప్పారావు హర్షం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

చేనేత రంగాన్ని ఆదుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు బుధవారం అసెంబ్లీలో కోరారు. రాష్ట్రంలో పొందూరు, మంగళగిరి, ఉప్పాడ చేనేత వస్త్రాలు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప జేశాయన్నారు. కేంద్రం నేషనల్ హేండ్లూమ్ డెవలప్ ప్రోగ్రాం ద్వారా సెక్టార్లుగా ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు శిక్షణ, నైపుణ్యం, డిజైన్లు తదితర వాటిని పెంపొందే కార్యక్రమాలను చేపడుతున్నట్టు వివరించారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారని, ముద్రా రుణాల ద్వారా ఆదుకుంటు న్నారన్నారు. ఈ సౌకర్యాలను ఎపిలో కూడా చేనేత కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. రాష్ట్రంలో చేనేత కార్మికులు దీనావస్థలో ఉన్నారని, భార్య, భర్తలు కలిసి పనిచేస్తే నెలకు రూ.15 వేలు సంపాదించడం కష్టమవు తుందన్నారు. వీరికి ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేస్తే కొంత ప్రయోజనం చేకూరుతుందన్నారు.


పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకుల పరామర్శ

వజ్రపుకొత్తూరు: విశ్రాంత ఎస్ఐ తమ్మినేని గురుమూర్తి (72) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు బి.ఆనందరావు బుధవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా గురుమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎన్.మోహనరావు, బి.రామకృష్ణ, ఎన్.భైరాగి, డి.ఆనందరావు పాల్గొన్నారు.


బాలరాజును పరామర్శిస్తున్న సాయికుమార్ తదితరులు

పరామర్శ

లావేరు : మండల కేంద్రంలోని ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించారు. లావేరుకు చెందిన తూతిక బాలరాజు మాస్టర్ తండ్రి తూతిక లోకనాథం మార్చి 4న అనారోగ్యంతో మృతి చెందడంతో సాయికుమార్ బాలరాజును పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నక్కిన ఆశిరప్పడు మనవడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆ బాలుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపిటిసి యినపకుర్తి సతీష్, లావేరు ఉప సర్పంచ్ పైడి దాము, వైసిపి నాయకులు లంకలపల్లి గోపి, కొండక త్రినాథ్, తలారి నాగయ్య, లంకలపల్లి చిన్న, యినపకుర్తి రాంబాబు, అప్పలస్వామి, మహదాస్ తదితరులున్నారు.

రేపట్నుంచి గ్రామ దేవత ఉత్సవాలు

నందిగాం : మండలంలోని నరేంద్రపురంలో నూతనంగా నిర్మించిన రొయ్యబోడెమ్మ భూలోకమత గ్రామ దేవత ఉత్సవాలు ఈ నెల 7 నుంచి నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు తెలకచర్ల ప్రసాద్ శర్మ, వైద్య భూషణ్ సత్యనారాయణ శర్మ, బంకుపల్లి సంతోష్ శర్మ నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.